ఎస్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యాన మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపిపాలెం నార్త్‌లో మంగళవారం ఎస్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విపత్తుల సమయంలో భవనాలు కూలి, వాటిలో చిక్కుకున్న క్షతగాత్రులను రక్షించడం, అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించే విధానం, కాలువలు, నదుల్లో మునిగిన వారిని గుర్తించి తీసుకురావడం తదితర విషయాలపై ప్రజలకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిఆర్‌ఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త సిహెచ్.పీటర్, పర్యవేక్షకులు డ్వామా పీడీ సిహెచ్.అప్పారావు, ఆర్‌డిఒ దాసి రాజు, అగ్నిమాపక జిల్లా అధికారి బి.శ్రీనివాసరావు, ట్రెయినీ డిఎస్‌పి కె.మానస, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, తహశీల్దార్ కె.రాజుకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐలు జి.వాసు, వై.నాగలక్ష్మి భార్గవరామ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు..!

ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న కొనుగోలు కేంద్రాలు

'పశ్చిమ'లో 6 లక్షల మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో 2.25 మెట్రిక్ టన్నుల సేకరణకు ఏర్పాట్లు

గోనె సంచులు, రవాణా ఏర్పాట్లే కీలకం

కౌలురైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ చేసేనా?

హమాలీ, రవాణా ఛార్జీలపై రైతుల్లో అవగాహన కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ మాసూళ్లకు సమయం ఆసన్నమైంది. వరి సాగు చివరిదశకు చేరింది. మరో వారం రోజుల్లో రైతులు కోతలు కోసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు 3.25 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఏలూరు జిల్లాలో ఏప్రిల్ రెండో తేదీ నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రబీలో మొత్తం 3.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబబడి వస్తుందని అంచనా వేయగా 2.25 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. దీనికిగాను 118 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు 49 లక్షల గోనె సంచులను ఇప్పటికే సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 308 రైతుసేవా కేంద్రాల ద్వారా ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్ధేశించుకున్నారు. పశ్చిమలో ఏప్రిల్ మూడో తేదీ నుంచి ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో గోనె సంచులు సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. డెల్టా మండలాల్లో ఎకరాకు 50 బస్తాలకుపైగా దిగుబడి వస్తుంది. మెట్ట ప్రాంతంలో ఎకరాకు 40 బస్తాలలోపే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గోనె సంచుల కేటాయింపులో దిగుబడిని బట్టి కేటాయించకపోతే డెల్టా మండలాల్లో రైతులు ఇబ్బంది పడే పరిస్థితి రానుంది. గత ప్రభుత్వ హయాంలో ఇదే సమస్య రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఖరీఫ్‌లో దిగుబడి తక్కువ కాబట్టి సమస్య ఉండదు. రబీలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటుంది. అధికారులు అందుకు తగినట్లుగా జాగ్రత్తలు తీసుకుంటారో, లేదో వేచిచూడాలి. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర ప్రకారం సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300, ఎ-గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2,320 చొప్పున కొనుగోలు చేయనున్నారు. రైతులు దళారులకు తక్కువకు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మేలు జరగనుంది. ధాన్యం కొనుగోలులో రైతులు ఎక్కువగా ఎదుర్కొనే సమస్యల్లో గోనె సంచులు, రవాణా ప్రధానంగా ఉంటున్నాయి. గడిచిన ఖరీఫ్‌లో పెద్దగా సమస్యల్లేకుండా ధాన్యం కొనుగోలు సాగింది. రబీలోనూ సంచులు, రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కౌలురైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ చేస్తారా..?

ధాన్యం అమ్మకాల్లో వాస్తవ సాగుదారులైన కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని తన పేరుమీద కౌలురైతులు అమ్ముకోలేని పరిస్థితి ప్రభుత్వ విధానాల ఫలితంగా దాపురించింది. ఇ-క్రాప్ ప్రక్రియలో భూయజమానుల పేర్లనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో ధాన్యం సైతం భూయజమాని పేరుపైనే అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో ధాన్యం సొమ్ము కౌలురైతుల ఖాతాల్లో పడటం లేదు. భూయజమాని ఖాతాలో జమ చేస్తున్నారు. దీంతో ధాన్యం సొమ్ము జమైన తర్వాత సొమ్ము కోసం కౌలురైతులు భూయజమానుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. కొంతమంది భూయజమానులు ధాన్యం సొమ్ము కౌలురైతులకు ఇవ్వకుండా రోజులు తరబడి కాలయాపన చేస్తున్నారు. దీంతో కౌలురైతులు కూలీలకు, కోత మిషన్లకు కిరాయి ఇచ్చేందుకు సొమ్ము కోసం నానాతంటాలు పడుతున్నారు. పంట పండించిన కౌలురైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. హమాలీలకు సంబంధించిన సొమ్ము కౌలురైతులు పెట్టుకుంటున్నా భూయజమాని ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. హమాలీల సొమ్మును భూయజమానులు కౌలురైతులకు ఇవ్వడం లేదు. దీంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. హమాలీ, రవాణా ఛార్జీలపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం కొనుగోలులో ప్రతి అంశంపైనా రైతులకు అవగాహన కల్పించి ముందుకు సాగితే అన్నదాతకు మరింత మేలు జరుగుతుంది.

అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో మొదటిరోజు మంగళవారం పాల్గొన్న పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

రేపు ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నికలు

అత్తిలి, యలమంచిలిల్లో ఎంపిపిలు, అత్తిలి, ఏలూరు, కైకలూరుల్లో వైస్ ఎంపిపిల ఎన్నిక

27న ఉదయం పది గంటలకు ప్రక్రియ ప్రారంభం

డిఆర్‌ఒ, జడ్‌పి సిఇఒ సంబంధిత అధికారులతో సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖాళీగా ఉన్న అత్తిలి, యలమంచిలి మండల పరిషత్ అధ్యక్ష పదవులకు, అత్తిలి, కైకలూరు, ఏలూరు మండలాల ఉపాధ్యక్షుల పదవులకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ ఈ నెల 27న జరగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు సంబంధిత అధికారులతో మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సమీక్షించారు. సమావేశంలో సంబంధిత మండలాల ఎంపిడిఒలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి పాల్గొన్నారు. ఎన్నికల రోజు బందోబస్తు, వీడియోగ్రఫీ ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం పది గంటలకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అనంతరం పరిశీలన, విత్‌డ్రా ప్రక్రియ నడుస్తుంది. ఒంటి గంటకు ఎంపిటిసిలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. చేతులెత్తడం ద్వారా ఎన్నిక నిర్వహించి అధికంగా ఓట్లు వచ్చిన వారిని అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ప్రకటిస్తారు. ఈ కార్యక్రమానికి ఎంపీ, ఎంఎల్‌ఎలు, కోఆప్షన్ సభ్యులు హాజరైనప్పటికీ ఓటింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉండదు. కోరం ఏర్పడకపోతే తర్వాత రోజు 28వ తేదీ 11 గంటలకు మళ్లీ ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తారు. అప్పటికీ కోరం ఏర్పడకపోతే ఎన్నికల కమిషన్‌కు నివేదించి వాయిదా వేస్తారు. ఏలూరు వైస్ ఎంపిపి ఎన్నికపై రాజకీయ రగడ నెలకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక్కడ ఎన్నిక జరుగుతుందా లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి.

27న పంచాయతీ ఉప సర్పంచి ఎన్నికలు

ఏలూరు జిల్లాలో పది, పశ్చిమలో 17 పంచాయతీల్లో ఎన్నికలు

ఎన్నికల ఏర్పాట్లపై డిఆర్‌ఒ, డిపిఒ సమీక్షా సమావేశం

ఈ నెల 27వతేదీ గురువారం రెండు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పలు పంచాయతీలకు సంబంధించిన ఉప సర్పంచి ఎన్నికలు జరగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, డిపిఒ కె.అనూరాధ సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచి ఎన్నికలు జరగనున్న పంచాయతీలు ఏలూరు జిల్లాలో పది ఉన్నాయి. ముదినేపల్లి మండలం ప్రొద్దువాక, చింతలపూడి మండలం రేచర్ల, మండవల్లి మండలం ముదుతాళ్లపాడు, లోకుమూడి, పెదవేగి మండలంలో రామశింగవరం, కొండలరావుపాలెం, దెందులూరు మండలంలో దెందులూరు, కలిదిండి మండలంలో భాస్కరరావుపేట, నిడమర్రు మండలంలో ఎనికేపల్లి, కొయ్యలగూడెం మండలంలో ఆచ్యుతాపురం ఉన్నాయి. నోటిఫికేషన్‌లో నిడమర్రు మండలంలో అడవికొలను గ్రామం ఉప సర్పంచి ఎన్నిక నిర్వహించాలని పేర్కొనప్పటికీ ఒకచోట వార్డు మెంబర్ స్థానం ఖాళీగా ఉండటంతో ఎన్నికల కమిషన్ అక్కడ ఎన్నికను నిలిపివేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో 17 గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచి ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో నరసాపురం మండలం మల్లవరం, గొంది, భీమవరం మండలంలో గొల్లవానితిప్ప, గూట్లపాడు, ఎల్‌విఎన్‌పురం, బేతపూడి, అత్తిలి మండలంలో కెఎస్.గట్టు, ఇరగవరం మండలంలో కొత్తపాడు, మొగల్తూరు మండలంలో కెపి పాలెం సౌత్, పేరుపాలెం సౌత్, పాలకొల్లు మండలంలో అగర్తిపాలెం, గోరింటాడ, ఉండి మండలంలో ఎన్‌ఆర్‌పి అగ్రహారం, వీరవాసరం మండలంలో పెర్కిపాలెం, యలమంచిలి మండలంలో అబ్బిరాజుపాలెం, పాలకోడేరు మండలంలో గొరగనమూడి గ్రామాలు ఉన్నాయి. 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభించి చేతులెత్తే విధానంలో ఆయా పంచాయతీల్లో ఉప సర్పంచి ఎన్నిక నిర్వహిస్తారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు డిఆర్‌ఒ, డిపిఒ ఆదేశాలు జారీ చేశారు.

రైతు సమస్యల పరిష్కారానికే 'పొలం పిలుస్తుంది'

జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పెంటపాడు

రైతుల సమస్యల పరిష్కారానికే 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఆకుతీగపాడు గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తుంది'లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వరి పైరు సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించడం, రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటం, లాభసాటి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడం తదితర అంశాలను వివరిస్తామన్నారు. కోత దశకు వచ్చిన వరి పొలాలు 80 శాతం గింజలు గట్టిపడిన తర్వాత కోత కోసి రెండు రోజులు పనలు ఆరబెట్టి 17 శాతం తేమ వచ్చిన తర్వాత రైతుసేవా కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకురావాలన్నారు. పిఎండిఎస్ నవధాన్యాల సాగుకు సంబంధించి పచ్చి రొట్ట పైరు విత్తనాలను పది కిలోల ప్యాకెట్లు రూ.700 చొప్పున రైతులకు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. దాళ్వా పంట కోత కోయక ముందే పచ్చి రొట్ట విత్తనాలను చిమ్మాలన్నారు. తద్వారా భూమి సారవంతమై కార్బన్ శాతం పెరిగి పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి రైతులు పలు సమస్యలను వివరించారు. చిరిగిన గోనె సంచులు ఎక్కువగా వస్తున్నాయని, వాటి వల్ల ఇబ్బంది కలుగుతుందని అన్నారు. దీనిపై ఆయన స్పందించి మాట్లాడుతూ మిల్లుల వద్ద నుండి వచ్చే సంచులకు నెంబర్లు ఇస్తారని, తద్వారా వాటి స్థానంలో తిరిగి కొత్త సంచులను తీసుకోవచ్చని అన్నారు. పెంటపాడులో ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామన్నారు. ముదునూరుపాడు వద్ద రైతులు కోసిన వరి పొలాలు ఎక్సెల్ పది రకం ధాన్యాన్ని జెసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌశల్ భానో, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, ఎఒ కె.పార్థసారథి, తహశీల్దార్ సీతారత్నం, ఎంపిడిఒ ఎంఎల్‌ఒ.రవి, గ్రామ సర్పంచి డి.వెంకటేశ్వర్లు, ఎంపిటిసి కె.వెంకట్రావు, నీటి సంఘం అధ్యక్షులు ఎం.సూర్యచంద్రరావు, బాబు, ధనరాజ్, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

నరసాపురం మున్సిపాల్టీలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక మున్సిపాల్టీలో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పలు విభాగాల్లోని రికార్డులను పరిశీలించారు. జిఎడి విజిలెన్స్ (జనరల్ అడ్మిస్ట్రేటివ్) డిఇ శ్రీనివాసన్ నేతృత్వంలో శ్రీనివాసరావు, మహేశ్వరవర్మ, అనిల్‌బాబు ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటరీ విభాగాల్లో పని చేసే అధికారులను రప్పించి వివరాలు కోరారు. గతంలో పని చేసి బదిలీ అయిన ఇంజినీర్లు సురేష్, సునీల్, రవిచంద్ర, మణిలను కూడా పిలిపించారు. వారి హయాంలోని ఎం.బుక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాదాపు ఆరుగంటల పాటు విచారణ సాగింది. గత ప్రభుత్వ హయాంలో 2019-24 మధ్య వివిధ నిధులతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో కొన్నింటిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటు టౌన్‌ప్లానింగ్‌లో నిబంధనలు అతిక్రమించి కొన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణాలు జరిగాయి. శానిటరీ, రెవెన్యూ విభాగాల్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారని, కొన్ని కొనుగోళ్లల్లోనూ అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. వీటిపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే విజిలెన్స్ తనిఖీలు సాగాయనే ప్రచారం సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు డిఇ శ్రీనివాసన్ చెప్పారు. ప్రాథమికంగా అన్ని శాఖల అధికారుల నుంచి వివరాలను సేకరిస్తున్నామన్నారు. దానికి అనుగుణంగా రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. నివేదికను తమ ఉన్నతాధికారులు సమర్పిస్తామన్నారు.

తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం

- పిఎసి చైర్మన్ పి.రామాంజనేయులు
- మినీ స్టేట్‌బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఏప్రిల్ 4న భీమవరంలో జరిగే మినీ స్టేట్‌బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్‌ను తన క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ అంజిబాబు మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా బాడీబిల్డింగ్ జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజర్ వలవల ఫణి మాట్లాడుతూ ఏప్రిల్ 4న భీమవరం టౌన్ హాల్లో 55, 60, 65, 70, 75, 80, 85 కిలోల కేటగిరీలో పోటీలు జరుగుతాయని, ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌కు రూ.25 వేలు బహుమతి అందిస్తామని, అన్ని కేటగిరీల్లోని మొదటి మూడు స్థానాల్లోని విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాడీబిల్డింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పత్తి సురేష్, జిల్లా ప్రెసిడెంట్ కఠారి రవిశంకర్, సెక్రటరీ షేక్ ఖాసీం, ట్రెజరర్ ఎం.వాసు, పెంటకోటి శ్రీను, ఎస్‌కె.హుస్సీ, వై.ఉపేంద్ర, ఏసు ప్రకాష్, టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, టౌన్ హాల్ అధ్యక్షులు కోళ్ల రామచంద్రరావు, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇలతో ఉపాధి అవకాశాలు మెండు

ప్రజాశక్తి - తణుకు

మన దేశ ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ) శక్తివంతమైనవని, ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ఆంధ్రా యూనివర్సిటీ ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వివిఎస్.రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో భారతదేశంలో వ్యవస్థాపకత సామాజిక, ఆర్థిక కోణాలు-చారిత్రక, రాజకీయ దృక్కోణాలు అనే అంశంపై సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల రూపంలో, అనేక పథకాల రూపంలో, కరెంటు రాయితీల రూపంలో ఐదు సంవత్సరాలపాటు అందిస్తున్నాయన్నారు. ఈ రంగంలో కొత్త కొత్త ఆలోచనలు పెంపొందించుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో ఇంటి అలంకరణ, పుట్టిన రోజు వేడుకలు, ఈవెంట్ మేనేజర్లుగా ఉపాధి పొందుతున్నారన్నారు. తాజా సాంకేతికత అంశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఎన్‌ఆర్‌డి, పిఆర్ గవర్నమెంటు ఆఫ్ ఇండియా, హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌చటర్జీ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ సెక్టారులో మరింత మంది వ్యవస్థాపకులు రావాలని, స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం 25 కోట్ల మంది మన దేశంలో స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, డాక్టర్ అల్లూరి వెంకటనాగవర్మ, కోకన్వీనర్ జి.అరుణకుమారి, వి.నాగన్న, ఎం.శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వివిఎస్ రామకృష్ణ

రేపు సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించిన జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - పోలవరం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 27న పోలవరం ప్రాజెక్టు పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టులోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లను ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 27న పోలవరంలో సిఎం పర్యటన పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఏర్పాట్లపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. పోలవరం ప్రాజెక్ట్ వ్యూపాయింట్ వద్ద హెలీప్యాడ్ ఏర్పాట్లు, ప్రాజెక్ట్ పురోగతి పనులు సందర్శించే ప్రాంతాలను, పార్కింగ్, విఐపి గ్యాలరీ, ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించే సమావేశపుహాలు తదితర ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. విధుల్లో ఎటువంటి పొరపాట్లూ జరగకుండా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జెసి సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయీస్ డిఎం వి.శ్రీలక్ష్మి, డిఎస్ఒ ప్రతాపరెడ్డి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్, జిల్లా ఫైరాఫీసర్ సిహెచ్.రత్నబాబు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోకో గింజలను కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కోకో పంటకు మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే కోకో గింజలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ల వెంకట సుబ్బారావు, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు కోరారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు తాడేపల్లిగూడెం మండలంలోని పలు గ్రామాల కోకో రైతులు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయంలోనూ కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు సుబ్బారావు, బాబూరావు మాట్లాడుతూ కోకో గింజల ధర రోజురోజుకీ పడిపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత సీజన్‌లో అంతర్జాతీయ మార్కెట్ రేటు ప్రకారం కిలో గింజల ధర రూ.వెయ్యి నుంచి రూ.11 వందల వరకు కంపెనీలు ఇవ్వగా, ఈ సీజన్లో సగానికిపైగా ధర తగ్గించి కంపెనీలు అడుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ధరకు అనుగుణంగా కోకో పంటకు మద్దతు ధర అందేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. కోకో పంటకు మద్దతు ధర ప్రకటించాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు వెలమాటి విశ్వేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కోకో రైతులు నీరుకొండ వెంకట రామారావు, దూసనపూడి వీర్రాజు, ఈదర పురుషోత్తం, కాసగాని పోతురాజు, అబ్బిన గోపాలకృష్ణ, చేకూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. చినతాడేపల్లి, కడియద్ద, కష్టాపురం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం తదితర గ్రామాలకు చెందిన కోకో రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కోకో రైతులు

లేస్ ట్రేడ్ సెంటర్‌ను సందర్శించిన ఛాంబర్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ కళాశాల నుంచి కామర్స్ అండ్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ స్టడీస్ బికాం, బిబిఎ విద్యార్థులు, అధ్యాపకులు కలిసి నరసాపురం ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్‌ను సందర్శించారు. నరసాపురం టాయ్ సెంటర్‌ను కూడా సందర్శించారు. బిబిఎ కరికులంలో భాగంగా ఇండస్ట్రియల్ టూర్ షార్ట్ విజిట్ నిర్వహించారు. ఈ లేస్ ట్రేడ్ సెంటర్లో ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్స్ వారు నిర్వహించిన ఎగ్జిబిషన్ వీక్షించారు. ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ నిర్వాహకులు తులసీరావు మాట్లాడుతూ హస్త కళలు, దేశీయ సాంప్రదాయ సంస్కృతులను ప్రతిబింబించే విధంగా ఉంటాయని తెలిపారు. వాటిని భవిష్యత్తు తరాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపై ఆధారపడి ఉందని చెప్పారు. ఈ హస్త కళలను ప్రోత్సహించడం ద్వారా స్వయం ఉపాధి లభిస్తుందన్నారు. తరువాత ఛాంబర్స్ కళాశాల విద్యార్థులు టాయ్స్ సెంటర్‌ను వీక్షించారు.

ఎస్.మధు

రమ్యశ్రీ

జి.రాజీవ్

నవోదయకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

గణపవరం: నవోదయకు మండలంలోని జల్లికాకినాడ, సరిపల్లి గ్రామాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం తెలిపారు. జల్లికాకినాడ పాఠశాల నుంచి ఎస్.మధు, జి.రాజీవ్, సరిపల్లి పాఠశాల నుంచి యాసరపు రమ్యశ్రీ ఎంపికైనట్లు తెలిపారు. ఈముగ్గురు విద్యార్థులు జనవరిలో రాత పరీక్షలో పాల్గొనున్నారని తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో ముగ్గురు విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అధికారులు, సర్పంచులు స్థానికులు అభినందించారు.

ప్రజల అవసరాలు తీర్చేందుకే పి4 సర్వే
ఎంపిడిఒ పి.సామ్యూల్

చిట్‌చాట్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వం సమర్థవంతంగా ప్రతి కుటుంబం అవసరాలూ గుర్తించడం, తద్వారా వారి అవసరాలు తీర్చడమే పి4 సర్వే ముఖ్యోద్దేశ్యమని ఎంపిడిఒ పి.సామ్యూల్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న : పి4 సర్వే గురించి ఆయా ఇంటి సభ్యులకు ఎలా వివరిస్తారు?

ఎంపిడిఒ: ఈ సర్వే ఆధారంగా జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రయివేటురంగంతో కలిసి ప్రత్యేక ప్రాజెక్టులు చేపడుతుందని వాస్తవ విషయాలను వివరిస్తాం.

ప్రశ్న : సర్వేలో వివరాలు చెప్పడానికి యజమాని, సభ్యులు ఇష్టపడకపోతే ఏం చేస్తారు?

ఎంపిడిఒ : పి4 సర్వే ముఖ్యోద్దేశం గురించి వారికి వివరిస్తాం. తరువాత వారిని ఒప్పించి సమాచారం నమోదు చేస్తాం.

ప్రశ్న : కుటుంబాల్లో సంపాదనా పరులను ఎలా గుర్తిస్తారు?

ఎంపిడిఒ : వ్యవసాయం, వ్యవసాయ కూలి, పెన్షన్, ఇళ్ల మీద అద్దెలు, ఇతరాల ద్వారా గుర్తిస్తాం.

ప్రశ్న: సర్వే సమయంలో ఇంట్లో ఎవరూ అందుబాటులో లేకపోతే ఎలా నమోదు చేస్తారు?

ఎంపిడిఒ : వలస వెళ్లినా, యజమాని మరణించినా గుర్తించి మరోసారి సందర్శించి వివరాలు నమోదు చేస్తాం.

ప్రశ్న : మండలంలో పి-4 సర్వే ఎంత మేరకు జరిగింది?

ఎంపిడిఒ : ఇప్పటికి 70 శాతం సర్వే పూర్తయ్యింది. 19 సచివాలయాల పరిధిలో 144 మంది సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లుగా సర్వే చేస్తున్నారు.

మాట్లాడుతున్న డిపిఎం నూకరాజు

ప్రకృతి వ్యవసాయం ఉపయోగకరం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రకృతి వ్యవసాయం ఎంతో ఉపయోగకరమని ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం వై.నూకరాజు అన్నారు. స్థానిక పెదపల్లవపాలెం రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు పంపిణీ చేసేందుకు 18 రకాల నవధాన్య విత్తనాలు 200 కిట్లుగా సిద్ధంగా చేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ నవధాన్యాలతో మొక్కకు కావలసిన పోషకాలు అందుతాయన్నారు. ప్రతి రైతూ ఈ కిట్‌ను ఉపయోగించుకుని తమ పొలాల్లో నవధాన్యాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఎం.అరుణకుమారి, ఎఒ అబ్దుల్‌రహీం, డివిజన్ ఇన్‌ఛార్జి నరసింగరావు, మండల ఇన్‌ఛార్జి కె.లక్ష్మికుమారి, సిబ్బంది హరిక, కె.మహాలక్ష్మి, జి.కనకదుర్గ భవాని, ఎం.దుర్గాభవాని, మావుళ్లు, రామలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

'రీ సర్వేపై గ్రామ సభల వల్ల ప్రయోజనం శూన్యం'

ఉండి: గత వైసిపి ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేపై కూటమి ప్రభుత్వం నిర్వహించిన గ్రామ సభల వల్ల రైతులకు చేకూరిన ప్రయోజనం శూన్యమని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్.గోపాలకృష్ణంరాజు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇచ్చిన హామీ ప్రకారం భూ సర్వేను రద్దు చేసిన సిఎం చంద్రబాబు నాయుడు అనతి కాలంలోనే యూటర్న్ తీసుకుని కేంద్ర ప్రభుత్వ నిధులకు ఆశపడి రీ సర్వేపై గ్రామసభలు నిర్వహిస్తున్నారని, వీటి వల్ల రైతులకు చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని పేర్కొన్నారు. గ్రామ సభల్లో రైతులు ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం చేయకుండా రైతులను మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజా ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం పని చేయాలని కోరారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు పండుగలు

భీమవరం టౌన్:మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు పండుగలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఈ నెల 30న భీమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవిజ్ఞానవేదికలో జరిగే ఉగాది పురస్కార వేడుకల బ్రోచర్‌ను మంగళవారం ఎంఎల్ఎ అంజిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను భవితరాలకు తెలియజేస్తూ 40 ఏళ్లుగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉగాది వేడుకల కమిటీ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు స్వచ్ఛంద సంస్థల్లో విశేష సేవలందిస్తున్న వారికి ఉగాది పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పి.ఏసుబాబు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, వడ్డీ సుబ్బారావు పాల్గొన్నారు.

31లోగా పన్ను చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ
మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం:2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బకాయి ఉన్న ఆస్తి, ఖాళీ స్థలా పన్నులు ఈనెల 31లోగా ఒకేసారి చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భవిష్యతులో చెల్లించే ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులు 2025-26 సంవత్సరానికి గాను చెల్లింపు కింద మినహాయించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు అవకాశాన్ని వినియోగించుకొని పన్ను చెల్లించి రాయితీ పొందాలని తెలిపారు.

ఆకివీడు : నగర పంచాయతీ పరిధిలోని గృహాలకు, ఇతర నిర్మాణాలకు యజమానులు చెల్లించాల్సిన ఇంటి పన్నుల బకాయిల్లో ప్రభుత్వం వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ అవకాశం కల్పించిందని నగర పంచాయతీ కమిషనర్ ఎంకె.కృష్ణమోహన్ తెలిపారు. ఇప్పటివరకూ బకాయిలున్న వారందరూ ఈనెల 31వ తేదీలోగా బకాయి, అసలు వడ్డీ ఏక మొత్తంగా చెల్లించినట్లయితే వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తుందని తెలిపారు. ఈ రాయితీ ఏక మొత్తంగా చెల్లించిన వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

పాలకొల్లు : ఆస్తి, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను ఏక మొత్తంలో చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జిఒ విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ విజయసారధి తెలిపారు. పన్ను చెల్లించాల్సిన చెల్లింపుదారులు బకాయి మొత్తాన్ని ఒకేసారి ఈనెల 31వ తేదీలోగా చెల్లిస్తేనే 50 శాతం వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. పాలకొల్లు పురపాలక సంఘం పరిధిలోని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

దువ్వ సొసైటీలో అవకతవకలు!
రైతుల ఆవేదన

తణుకు రూరల్:మండలంలోని దువ్వ ప్రాథమిక వ్యవసాయ పరపతి సొసైటీలో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లు రైతులు వాపోయారు. మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రైతులు గోడు వెలిబుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన కొప్పిశెట్టి రాము హనుమాన్ కుమార్‌కు లోను చెల్లించాల్సిన రైతులు ఫోన్ పే, వ్యక్తి చేతుల మీదుగా చెల్లించేవారు. సుమారు రూ.14 లక్షల వరకూ కట్టించుకున్నాడు. అయితే గత కొంతకాలంగా హనుమాన్ కుమార్ పరారీలో ఉండడంతో అసలు విషయం బయటకు వచ్చింది. సొసైటీ నుంచి రైతులకు లోన్లు చెల్లింపు నిమిత్తం ఫోన్లు రావడంతో అసలు విషయం బయటకొచ్చింది. రెండేళ్లుగా కట్టిన సొమ్ము లోను ఖాతాల్లో జమ కాలేదని స్పష్టమైంది. ఇలా మొత్తం పరిశీలిస్తే రూ.25 లక్షల వరకూ స్వాహా చేసినట్లు రైతులు వాపోతున్నారు. భరత్ కుమార్ అనే వ్యక్తి సొసైటీ ద్వారా లోన్ తీసుకుని హనుమ కుమార్‌కు రూ.1.46 లక్షలు 2024లో ఫోన్ పే ద్వారా చెల్లించాడని, రసీదు కూడా వాట్సప్ ద్వారా పంపించాడని తెలిపారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున రైతులు ఆందోళన దిగారు. తమ డబ్బులు తమకు ఇప్పించి న్యాయం చేయాలని వాపోయారు. సొసైటీలో జరిగిన అవకతవకల ఘటనపై ఈ నెల 12న తణుకు గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ప్రత్యేక అధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆందోళనకర పరిస్థితులు నెలకొనడం సమావేశం వాయిదా వేశారు.

పాస్టర్ మృతికి సంతాపం

తణుకు: రాజమండ్రిలో రోడ్డు ప్రమాదంలో అనుమానాస్పదంగా మృతి చెందిన ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి మండల పాస్టర్స్ ఫెలోషిప్ సంతాపం తెలిపింది. అధ్యక్షులు మనోజ్ బాబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి బ్లెస్సింగ్ రాజ్ మాట్లాడారు. పోలీసులు పోస్ట్ మార్టం ద్వారా విషయాలు నిగ్గుతేల్చాలని కోరారు. త్వరలోనే అన్ని విషయాలూ తెలియాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఐజక్ బ్రెన్హమ్, డేవిడ్ బాబు, జోయన్న, ఏసురత్నం జాషువా పాల్గొన్నారు.

కుక్కలకు వింత వ్యాధి..!
ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - ఉండి

మండలంలో వీధి కుక్కలు వింత వ్యాధితో బాధపడుతున్నాయి. వందలో 90 శాతం కుక్కలకు శరీరంపై జుట్టు ఊడిపోయి, మచ్చలు ఏర్పడి బక్కచిక్కిపోతున్నాయి. ఇవి వింత వ్యాధితో రోడ్లపై తిరుగుతూ ఉంటే వాటిని చూసిన ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో కరోనా వైరస్‌తో జనం అల్లాడిపోయారు. ఇటీవల కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి వేలాది కోళ్లు చనిపోవడంతో వాటిని తినడానికి నిరాకరించిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం కుక్కలకు ఈ వింత వ్యాధి రావడంతో స్థానికులు భయపడుతున్నారు. వీటి నుంచి తమకు హాని కలుగుతుందేమోనని స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. పశు వైద్య నిపుణులు నిర్ధారణ చేసి చెప్పాలని వేడుకుంటున్నారు. ఈ వ్యాధి సోకిన కుక్కలు కాలంతో గిరుకుని చనిపోతున్నాయి. వాటి పిల్లలు కూడా చనిపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కొంతమంది వీధి కుక్కలను పశు వైద్యాధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ పశు వైద్యాధికారులు వాటిపై దృష్టి సారించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు పరిశీలించి దీనికి కారణం ఏంటని, వాటికి టీకాలు వేయాలని కోరుతున్నారు.

జుట్టు ఊడిపోయి శరీరంపై మచ్చలతో ఉన్న కుక్కలు

మూడు గ్రామాల్లో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ

ప్రజాశక్తి - పాలకోడేరు

మండల పరిధిలోని పెన్నాడ అగ్రహారం, గొరగనమూడి, విస్సాకోడేరు గ్రామాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామ స్వరూపాన్ని రంగవల్లులతో చిత్రాలుగా తీర్చిదిద్ది రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ కళాశాల అధిపతి డి.శ్రీనివాస్, కెవికె అధిపతి డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ హెచ్.శ్రీనివాసరావు, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.బిందు ప్రవీణ హాజరయ్యారు. ప్రస్తుత పంటల్లో ఉన్న సమస్యలు, వరిలో తెగుళ్ల సమస్యలు తెలుసుకుని రైతులకు పలు సలహాలు అందజేశారు. అలాగే కళాశాల విద్యార్థులకు గ్రామ స్వరూపం విశిష్టత, ప్రాముఖ్యత, జీవన ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు నాని, కృష్ణ, గిరీష్ గ్రామ పెద్దలు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ స్వరూప రంగవల్లులతో శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు

నాటిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం కళాపరిషత్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే 11వ అఖిల భారత స్థాయి నాటిక పోటీలను సోమవారం రాత్రి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ ప్రారంభించారు. కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ కళాపరిషత్ పోషణ కత్తిమీద సాములాంటిదన్నారు. నాటక రంగానికి అనుకున్న స్థాయిలో సహకారం అందడంలేదని, ప్రజల నుంచి ప్రోత్సాహం కరువైందని తెలిపారు. ఇటువంటి తరుణంలో పరిషత్‌ల ద్వారా నేటి తరానికి నాటక రంగాన్ని పరిచయం చేయడం అభినందనీయన్నారు. సంప్రదాయాలను గౌరవిస్తూ గ్రామీణ కళారంగాలను గౌరవిస్తూ ఏటికొప్పాక, తోలుబొమ్మలాట వంటి కళాకారులకు కూడా పద్మశ్రీ అవార్డులకు ఎంపిక చేయడం, మోడీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. కళా పరిషత్‌లకు తన వంతు సహకారం ఉంటుదన్నారు. జాతీయ రహదారి 165 బైపాస్ ఎలైన్‌మెంట్ కోసం వీరవాసరం పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి ఆయా ప్రాంతాలను పరిశీలించాల్సి వచ్చిందన్నారు. రెండు సంవత్సరాల్లో ఆకివీడు నుంచి దిగమర్రు వరకూ ఏర్పాటు చేయనున్న జాతీయ రహదారిని రెండేళ్లలో పూర్తి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నారని, ఎవరి ఒత్తిడులకు తలొగ్గకుండా జాతీయ రహదారికి కొత్త ఎలైన్‌మెంట్ రూపొందించడం జరిగిందని తెలిపారు. అనంతరం మంత్రి నరసాపురం వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణ, తాడేపల్లిగూడెం బివిఆర్ కళాకేంద్రం అధ్యక్షులు బి.వెంకట రామా రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, వి.చంద్రశేఖర్, ఎ.లీలాకృష్ణ, సిహెచ్. సత్యనారాయణ, గోపాలకృష్ణ, పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

చినమిల్లి సత్యనారాయణ, బుద్దాల వెంకట రామారావును సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాసవర్మ

పేదలకు ప్రభుత్వం అండ
సిఎం ఆదేశంతో మహిళకు ఇంటి స్థలం పట్టా అందజేత

ప్రజాశక్తి - తణుకు

పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తణుకు పర్యటనలో కలిసి తన గోడు వెళ్లబోసుకున్న మహిళకు ఇంటి స్థలం పట్టాను మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎంఎల్ఎ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇచ్చిన అయిదు రోజుల్లోనే బాధితురాలిని గుర్తించి సిఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష చెక్కును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అందజేశారని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఓ మహిళ తన గోడు వినిపించుకుందన్నారు. తన కుమారుడు మానసిక వికలాంగుడు కావడంతో 17 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, కనీసం పెన్షన్ కూడా మంజూరు చేయాలని కోరడంతో ముఖ్యమంత్రి స్పందించారని తెలిపారు. అయితే ఆమె వివరాలు లేకపోవడంతో కేవలం ఫొటో ఆధారంగా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన నందివాడ ఏసమ్మగా గుర్తించామన్నారు. ఆమెను ఆదుకునే విధంగా ఇంటి స్థలం మంజూరు చేసి పట్టా అందజేసినట్లు ఎంఎల్ఎ వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అశోక్‌వర్మ పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తికి ఏడు నెలల జైలు

నరసాపురం:దొంగతనం కేసులో ముద్దాయికి నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ ఆర్.వరలక్ష్మి మంగళవారం తీర్పు ఇచ్చినట్లు కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కెఎస్.భాస్కరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యలమంచిలి మండలం పెనుమర్రు గ్రామానికి చెందిన ఉండ్రాజవరం పెద్దింట్లు ఇంట్లో గతేడాది జూన్ 8వ తేదీ రాత్రి అందరూ నిద్రపోయే సమయంలో ముద్దాయి రేకపల్లి నాగరాజు ఇంట్లోకి ప్రవేశించి రూ.70 వేల నగదు, నాలుగు బంగారు ఉంగరాలు, ఒక బ్రాస్లెట్ దొంగించాడు. అప్పటి ఎస్ఐ కె.శివన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రస్తుత ఎస్ఐ కె.గురవయ్య నిందితుడని అరెస్ట్ చేసి దొంగిలించిన వాటిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చగా విచారణ అనంతరం మంగళవారం ముద్దాయికి ఏడు నెలలు జైలు శిక్ష విధించారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ళ మండలం, కాళ్ళకూరు గ్రామం, చిన్నపేట, డోర్ నెం. 6-71 కాపురస్తులు ఓగిరాల రత్నంరాజు, S/o ఓగిరాల సుందరరావు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. **పాస్‌పోర్ట్ నెం. S0804478.** ది.17-03-2025 తేదిన నా ఒరిజినల్ పాస్‌పోర్టును కవరులో పెట్టుకొని కాళ్ళకూరు గ్రామంలో మా ఇంటి వద్ద నుండి కాళ్ళ వెళ్ళుచుండగా సదరు పాస్‌పోర్ట్ గల కవరు మార్గమధ్యలో జారి పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఓగిరాల రత్నంరాజు
S/o. ఓగిరాల సుందరరావు
డోర్ నెం. 6-71, చినపేట, కాళ్ళకూరు,
కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా, A.P.
సెల్: 99893 84333

ప్రొఫెసర్ తులసీరాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో సిఎస్ఇ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నేతల తులసీరాజు డాక్టరేట్ అందుకున్నారు. ఆయన డాక్టరేట్ ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ నుంచి వైస్ ఛాన్సలర్ ఎవిఎస్ఎల్.శర్మ చేతుల మీదుగా తులసీరాజు పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ బిదూష్ కుమార్ సాహు, స్వర్ణాంధ్ర కళాశాల సిఎస్ఇ హెచ్ఒడి డాక్టర్ పి.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఎన్ ఆప్టిమైజ్డ్ మైక్రో ఎర్రే డాటా ఎక్స్ట్రాక్షన్ అండ్ కేన్సర్ క్లాసిఫికేషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ అంశంపై చేసిన పరిశోధనకు గాను తులసీరాజుకు డాక్టరేట్ లభించింది. ఆయనను స్వర్ణాంధ్ర విద్యా సంస్థల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ, ట్రెజరర్ కొండవీటి వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ ఎస్.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ గోపిచంద్, తదితరులు అభినందించారు.

గౌరవం లేదు.. పదవులెందుకు
మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిల ఆవేదన

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయ్యాం కానీ మాకు గౌరవం ఇవ్వడం లేదు, కనీసం అధికార కార్యక్రమాలకు కూడా పిలవడం లేదు. అలాంటప్పుడు మాకు ఈ పదవులు ఎందుకంటూ మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఎంపిపి ఎం.సోనీ అధ్యక్షత వహించారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగినా కనీసం అధికారులు తమను పిలవలేదని లక్ష్మణేశ్వరం, కొప్పర్రు, వేములదీవి ఎంపిటిసిలు పాలపర్తి రామకృష్ణ, లక్ష్మి సంపూర్ణ, సంగాని రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపిడిఒ రామకృష్ణంరాజు మండల పరిషత్ తీర్మానం చేసి అన్నిశాఖల అధికారులకూ తెలియజేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా అధ్వానంగా ఉందని, జల జీవన్ మిషన్ ద్వారా కోట్లు వెచ్చించి పైప్‌లైన్లు వేసినా ప్రజలకు బిందెడు నీళ్లు కూడా రావడం లేదని సీతారాంపురం సర్పంచి దొండపాటి వెంకట్, పసలదీవి సర్పంచి కొట్టు రామాంజనేయులు, చామకూరిపాలెం సర్పంచి బొక్కా రామస్వామి, మల్లవరం లంక సర్పంచ్ సుజాతలు, లక్ష్మణేశ్వరం ఎంపిటిసి రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఎఇ లోకేశ్ మాట్లాడుతూ వేసవినాటికి పనులు పూర్తిచేసి అన్ని గ్రామాలకూ నీరందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని, గతంలో ప్రతిపాదించిన సీసీ రోడ్లు నిర్మించాలని సభ్యులు విన్నవించారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి వారి కోర్టులో

H.M.O.P.No. 25/2025

బిట్వీన్:-

యర్రంశెట్టి యామిని ప్రియాంక ...పిటీషనర్

And

యర్రంశెట్టి పృథ్వి,
R/o. D. No. 9-252/1, గాంధీనగర్, చేబ్రోలు,
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా. ...రెస్పాండెంట్

పై నెంబరు Divorce O.P లో పై రెస్పాండెంటుకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను ఉద్యేశ్యపూర్వకంగా తీసుకొనక దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఆర్డరు పై రెస్పాండెంటు హాజరు నిమిత్తము **ది.08-04-2025వ తేదికి** వాయిదా వేసినారు. కావున సదరు రెస్పాండెంటు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎమ్. రామచంద్రరావు బి.ఎ.ఎల్.ఎల్.బి
తాడేపల్లిగూడెం అడ్వకేట్
తేది:24-03-2025 తాడేపల్లిగూడెం
సెల్: 93955 90074

'ఎస్‌సి వర్గీకరణ ద్వారా మాలలకు అన్యాయం'

ప్రజాశక్తి - ఆచంట

తప్పులతడకగా ఉన్న రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఎస్‌సి వర్గీకరణ చేసి దళితులను విభజించి రాజ్యాంగం కల్పించిన సమాన, విస్తృత అవకాశాలను అందుకోకుండా చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆచంట నియోజకవర్గ మాల సంఘం జెఎసి చైర్మన్ సుంకర సీతారామ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికలో మాలల జనాభాని తగ్గించి చూపించి మాలలకు అన్యాయం చేశారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని 2011 జనాభా లెక్కలు తీసుకోవడంతో మాలలకు అన్యాయం జరిగిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలను అణిచివేసే ధోరణి అవలంబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాల సంఘాల జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఇలపర్రులో 'పొలం పిలుస్తోంది'

పెనుగొండ:మండలంలోని ఇలపర్రు, సిద్ధాంతం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి పి.స్పందన సమక్షంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సాగు ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రస్తుత వ్యవసాయ సాగులో అధిక మోతాదులో రసాయనిక ఎరువుల వాడకం ద్వారా రెండు పంటలైన అనంతరం భూమిలో బీడు పెట్టడం వల్ల భూమిలో సేంద్రియ కార్బన్ శాతం తగ్గుముఖం పట్టి నేల నిస్సారం అవుతుందన్నారు. సమస్యను అధిగమించాలంటే నవధాన్యాలు పప్పు జాతి, నూనె జాతి, సుగంధ ద్రవ్యాల జాతి, ధాన్యపు జాతి, పచ్చి రొట్ట మొదలైన రకాల విత్తనాలను కలిసి వస్తాయన్నారు. ఈ సాగు చేయడం వల్ల భూమిలో స్థూల, సూక్ష్మ పోషకాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : ఎల్‌బి చర్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఎడిఎ అనిల్ కుమారి రైతు కటకంశెట్టి గోపాలరావు పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అనిల్ కుమారి మాట్లాడుతూ మినికిట్ రకాలు మంచి దిగుబడి ఇస్తున్నాయన్నారు. రైతులందరూ ఈనెల 31వ తేదీలోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం జిల్లా వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, వీరాస్వామి, కె.మాణిక్యాలరావు, గురవయ్య నాయుడు పాల్గొన్నారు.

పోలిశెట్టి స్మారక స్తూపాన్ని తొలగించొద్దు

భీమవరం టౌన్:స్వాతంత్ర సమరయోధుడు, సిపిఐ అగ్రనేత యాళ్లబండి పోలిశెట్టి స్మారక స్తూపాన్ని వీరవాసరం మండలం నౌడూరు సెంటర్ రోడ్డు విస్తరణలో తొలగించొద్దని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎంఎల్ఎను ఆయన కార్యాలయంలో సిపిఐ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే యాళ్లబండి స్మారక స్తూపాన్ని తొలగించొద్దని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ యాళ్లబండి పోలిశెట్టి నాటితరం రాజకీయాల్లో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని పోరాటాలు చేశారని తెలిపారు. యాళ్లబండి సేవలకు గుర్తింపుగా గ్రామస్తులు నౌడూరులో ఆయన స్మారక స్తూపాన్ని నిర్మించారని, ఇప్పుడు రోడ్డు విస్తరణలో దాన్ని తొలగించడానికి మార్కింగ్ చేశారని ఎంఎల్ఎ దృష్టికి తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవి.ఆనంద్, పాలకోడేరు సిపిఐ కార్యదర్శి ఎం.లక్ష్మీపతి పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామికి రూ.9.51 లక్షల ఆదాయం

భీమవరం టౌన్:భీమవరం జెపి రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 147 రోజులకు గాను రూ.9,51,157 ఆదాయం వచ్చిందని ఆలయ ఛైర్మన్ మంతెన రామ్ కుమార్‌రాజు, ఆలయ ఇఒ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. కార్యక్రమంలో పండిత విల్లూరు గ్రూపు దేవస్థానం ఇఒ దండు వెంకట కృష్ణంరాజు, ఇతర దేవాలయాల ఇఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయము, మండల ప్రజా పరిషత్, నూజివీడు

టెండరు నోటీసు

ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, మండల పరిషత్ కార్యాలయంలో ఈ దిగువ షెడ్యూల్ దాఖలా పనులను నిర్వహించుటకు కాంట్రాక్ట్ పద్ధతిపై ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు పనిచేయబడుటకు గాను ది. 25-03-2025వ తేదీ ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం గం॥ 5.00 ల వరకు స్టీల్ టెండర్లు స్వీకరించబడును.

వ.నెం.	పని వివరము	సంఖ్య	పని కాలము
1	శానిటేషన్ వర్క్, సూపర్‌వైజర్ వర్కర్స్, గార్డినర్	3	1-4-2025 నుండి 31-3-2026 వరకు
2	శానిటేషన్ మెటీరియల్ సప్లై	-	1-4-2025 నుండి 31-3-2026 వరకు

కార్యాలయం వారి నోట్: గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. మరియు మండల ప్రజా పరిషత్ కార్యాలయ నిల్వలను బట్టి పేమెంట్ జరుపబడును.

సం/- **ఆరేపల్లి శిరీష, MPP**
మండల పరిషత్ కార్యాలయం
మండల ప్రజా పరిషత్, నూజివీడు

సం/- **MPDO**
మండల పరిషత్ కార్యాలయం
మండల ప్రజా పరిషత్, నూజివీడు

గ్రామపంచాయతీ కార్యాలయము, ములగలంపల్లి, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

రి.క. నెం.1/2025 **టెండరు నోటీసు** తేది.25-3-2025

ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, ములగలంపల్లి గ్రామపంచాయతీకి 2025-2026 సం॥నకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు ఈ దిగువన తెల్పిన వివిధ సేవలు నిర్వహించుటకు మరియు వివిధ రకాల సామాగ్రి సప్లయి చేయుటకు సంబంధించిన సీల్డు టెండర్లు ది. 29-03-2025వ తేదీ ఉదయం 11.00 గంటలకు గ్రామపంచాయతీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00 లకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నెం.	పని వివరం	పోస్టుల సంఖ్య	ధరావత్తు రూ.లలో
1	ట్యాంకు ఆపరేటరు పోస్టులు	04	50/-
2	క్లాప్ మిత్రా	02	50/-
3	క్లాప్ మిత్రా & Shed	01	50/-
4	ఎలక్ట్రీషియన్	01	50/-
5	ప్రజా ఆరోగ్య సామాగ్రి సరఫరా చేయుటకు		100/-
6	వీధి దీపముల విడిభాగాలు సరఫరా చేయుటకు		100/-
7	మంచినీటి సరఫరా సామాన్లు సరఫరా చేయుటకు		100/-
8	స్టేషనరీ మరియు ఆర్టికల్స్ సరఫరా చేయుటకు		100/-

సం/- **కంభంపాటి ప్రియాంక,** పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ - ములగలంపల్లి, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము, రాచన్నగూడెం, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

రి.క. నెం.1/2025 **టెండరు నోటీసు** తేది.25-3-2025

ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, రాచన్నగూడెం గ్రామపంచాయతీకి 2025-2026 సం॥నకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు ఈ దిగువన తెల్పిన వివిధ సేవలు నిర్వహించుటకు మరియు వివిధ రకాల సామాగ్రి సప్లయి చేయుటకు సంబంధించిన సీల్డు టెండర్లు ది. 28-03-2025వ తేదీ ఉదయం 11.00 గంటలకు గ్రామపంచాయతీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00 లకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నెం.	పని వివరం	పోస్టుల సంఖ్య	ధరావత్తు రూ.లలో
1	ట్యాంకు ఆపరేటరు పోస్టులు	07	50/-
2	క్లాప్ మిత్రా	02	50/-
3	క్లాప్ మిత్రా & Shed	01	50/-
4	ఎలక్ట్రీషియన్	01	50/-
5	ప్రజా ఆరోగ్య సామాగ్రి సరఫరా చేయుటకు		100/-
6	వీధి దీపముల విడిభాగాలు సరఫరా చేయుటకు		100/-
7	మంచినీటి సరఫరా సామాన్లు సరఫరా చేయుటకు		100/-
8	స్టేషనరీ మరియు ఆర్టికల్స్ సరఫరా చేయుటకు		100/-

సం/- **పాలడుగుల అశోక్,** పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ - రాచన్నగూడెం, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము, జీలుగుమిల్లి, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

రి.క. నెం.1/2025 **టెండరు నోటీసు** తేది.25-3-2025

ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, జీలుగుమిల్లి గ్రామపంచాయతీకి 2025-2026 సం॥నకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు ఈ దిగువన తెల్పిన వివిధ సేవలు నిర్వహించుటకు మరియు వివిధ రకాల సామాగ్రి సప్లయి చేయుటకు సంబంధించిన సీల్డు టెండర్లు ది. 29-03-2025వ తేదీ ఉదయం 11.00 గంటలకు గ్రామపంచాయతీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00 లకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నెం.	పని వివరం	పోస్టుల సంఖ్య	ధరావత్తు రూ.లలో
1	ట్యాంకు ఆపరేటరు పోస్టులు	04	50/-
2	క్లాప్ మిత్రా	03	50/-
3	క్లాప్ మిత్రా & Shed	01	50/-
4	ఎలక్ట్రీషియన్	01	50/-
5	ప్రజా ఆరోగ్య సామాగ్రి సరఫరా చేయుటకు		100/-
6	వీధి దీపముల విడిభాగాలు సరఫరా చేయుటకు		100/-
7	మంచినీటి సరఫరా సామాన్లు సరఫరా చేయుటకు		100/-
8	స్టేషనరీ మరియు ఆర్టికల్స్ సరఫరా చేయుటకు		100/-

సం/- **పాలడుగుల అశోక్,** పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ - జీలుగుమిల్లి, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా